

హత్యలు చేసి అంబేడ్కర్ విగ్రహం పెడతారా..?

ఐదేళ్లుగా దళితులకు ఏం చేశారో చెప్పండి..

సీఎం జగన్‌పై మాజీ మంత్రి పరిటాల సునీత ఫైర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): దళితుల హత్యలు, దళితులపై అత్యాచారాలు, దాడులను కప్పిపుచ్చుకునేందుకే అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఆవిష్కరించారని మాజీ మంత్రి పరిటాల సునీత విమర్శించారు. అనంతపురంలోని తన నివాసంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో గతంలో ఎన్నడూ లేని విధంగా దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరిగాయని ఆమె ఆరోపించారు. విగ్రహాలు ఏర్పాటు చేయడం కాదని, దళితులకు న్యాయం చేయాలని ఆమె జగన్‌కు సూచించారు. దళితులకు గతంలో ఉన్న పథకాల కంటే ఏం ఎక్కువ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగున్నరేళ్లలో దళితులపై ఆరు వేలకుపైగా దాడులు జరిగాయని, 188 మంది దళితుల్ని హత్య చేసిన రక్తచరిత్ర జగన్‌కు మాత్రమే ఉందని అన్నారు. 'దళిత జనోద్ధారకుడిలా నా ఎస్సీలు.. నా ఎస్సీలు అని ఊదరగొడతున్నారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలు చేయాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారు. ఏ ముఖం పెట్టుకుని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు..?' అని ఆమె జగన్‌ను ప్రశ్నించారు. టీడీపీ హయాంలో నాలుగు లక్షల మంది దళిత సోదరులకు ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసింది వాస్తవం కాదా అని నిలదీశారు. దళిత బిడ్డలు విదేశాల్లో విద్యనభ్యసించేందుకు తీసుకొచ్చిన అంబేడ్కర్ విదేశీ విద్యా పథకాన్ని నాలుగేళ్ల పాటు అటకెక్కించారని, అంబేడ్కర్ పేరును ఆ పథకానికి తొలగించి అవమానించారని అన్నారు. ఎస్సీలకు ఇచ్చే రుణాలపై టీడీపీ ప్రభుత్వం మొదటి ఏడాది నుంచే సబ్సిడీ అమలు చేసిందని, జగన్‌రెడ్డి మొదటి రెండేళ్లు తొలగించి మూడో ఏట నుంచి అమలయ్యేలా మార్చారని విమర్శించారు. వైసీపీ నాయకులే దళితులను చంపారని ఆరోపించారు. కోడికత్తి కేసులో దళిత బిడ్డ శీనుకు బెయిల్ రాకుండా కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బాధితుడిగా ఉన్న జగన్‌రెడ్డి డిక్లరేషన్ ఇస్తే శీనుకు బెయిల్ వస్తుందని కోర్టు చెప్పినా, నిందితుడి కుటుంబసభ్యులు వేడుకున్నా జగన్ కనికరించలేదని అన్నారు. అమాయకుడు, పేద దళిత కుటుంబానికి చెందిన శీనును కోడికత్తి డ్రామాకు వాడుకొని వదిలేశారని ఆరోపించారు. దళితుల్ని అడుగడుగునా వేధిస్తూ, హింసిస్తూ నేడు అంబేడ్కర్ విగ్రహాలు పెట్టి దళిత జాతిని మభ్యపెట్టలేరని అన్నారు. దళితులెవరూ జగన్‌ను విశ్వసించే పరిస్థితి లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులు ఓటుతో వైసీపీకి గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

ఇదంతా ఎన్నికల స్టంట్


టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా



రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం రూరల్, జనవరి 19: అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఎన్నికల స్టంట్ అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వర నాయుడు విమర్శించారు. అంబేడ్కర్ పాదాలు తాకడానికి కూడా జగన్ అనర్హుడని విమర్శించారు. సీఎం జగన్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడాన్ని నిరసిస్తూ పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం ర్యాలీ నిర్వహించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి రోడ్డుపై బైఠాయించారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక దళితులపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతుంటే.. ఏపీలో మాత్రం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని, ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు నిధులు కేటాయించి, దళితుల జీవన స్థితిగతులను మెరుగుపరిచామని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల పథకాలన్నింటినీ తొలగించి, వారిని అణచివేసిందని మండిపడ్డారు. మాస్క్ అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను వేధించి, ఆత్మహత్య చేసుకునేలా చేశారని ఆరోపించారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా వైసీపీ ప్రభుత్వం దళితులను అతిదారుణంగా హత్య చేసి డోర్ డెలివరీ చేసిందని అన్నారు. అటువంటి వైసీపీ ప్రభుత్వానికి అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత లేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సమయం ఆసన్నమైందని, దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం టీడీపీని గెలిపించాలని ఆయన కోరారు.

మేమేమీ వెర్రివెంగళప్పలం కాదు..!



- మేమేంటో చూపిస్తాం..!
- వీరాంజనేయులు నియామకంపై భగ్గుమంటున్న వ్యతిరేకవర్గం
- శింగనమల వైసీపీలో అసంతృప్తి సెగలు

అనంతపురం, జనవరి 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వుడ్ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరాంజనేయులు నియమాకం పట్ల ఆ నియోజకవర్గంలోని వైసీపీ దళిత నేతలు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. అధికార పార్టీ సామాజికవర్గంలోనూ భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి. అధికార పార్టీ నిర్వహించిన సర్వేల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేకు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తేలడంతో ఆమెకు టిక్కెట్ నిరాకరించారు. ఆమె స్థానంలో నియోజకవర్గ ఇన్‌చార్జిగా వీరాంజనేయులును నియమించారు. ఆయన నియామకమే పార్టీలో అసంతృప్తులకు దారితీస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యే, ఆమె భర్త అనుయాయుడికే ఇన్‌చార్జి పదవి ఎలా కట్టబెడుతారనే ప్రశ్న ఆ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే అధినాయకత్వం నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు. బయటికి చెప్పలేకపోయినా, సన్నిహితుల వద్ద తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో వీరాంజనేయులుతో కలిసి ఆమె ప్రజల్లోకి వెళ్తే... ఆ వ్యతిరేకత ప్రభావం చూపదా అని ఆశావహులు, అసంతుష్టులు ప్రశ్నిస్తున్నారు. జెండా మోసినోళ్లను కాదని కొత్త వ్యక్తికి అవకాశం ఇవ్వడం ఏమిటని వ్యతిరేకవర్గం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి ఎంతోమంది దళిత నేతలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నా, అధికార పార్టీ సామాజికవర్గం ముఖ్యనేత ఒత్తిళ్లకు అధినాయకత్వం తలొగ్గడాన్ని ఆ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి.

చిచ్చురేపిన నియామకం

వైసీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో చురుగ్గా ఉన్న దళిత నాయకులను నియోజకవర్గ ముఖ్యనేత దూరం పెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీ నియోజకవర్గమైనా, అధికార పార్టీ సామాజికవర్గం ముఖ్యనేత కనుసన్నల్లోనే ఆ నియోజకవర్గంలో రాజకీయాలు నడుస్తున్నాయనేది బహిరంగ రహస్యం. ఆయన మాట కాదన్నవారికి పార్టీలో చెక్ పడినట్లేనని, ఇక ఎలాంటి ప్రాధాన్యం ఉండదని అంటున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేకు టికెట్ నిరాకరణ నేపథ్యంలో.. ఓ మాజీ ఎమ్మెల్సీ, ఓ మాజీ ఎమ్మెల్యేతో పాటు మరికొందరు తటస్థులు ఆశావాహుల జాబితాలో చేరిపోయారు. ఈ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇవ్వాలని అధినాయకత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. కానీ అనూహ్యంగా నియోజకవర్గ ముఖ్యనేత పావులు కదిపి, తన అనుయాయుడిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించుకోవడంలో సఫలీకృతం అయ్యాడు. దీంతో ఆశావహులు తీవ్ర నిరాశకు లోనయ్యారు. తాజా నియామకం నియోజకవర్గంలో దళిత నేతలు, అధికార పార్టీ సామాజికవర్గం వారి మధ్య రాజకీయ చిచ్చుకు ఆజ్యం పోసిందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఆ ప్రభావం ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తుందని అంటున్నారు.

జెండా మోసినోళ్లను కాదని కొత్త వ్యక్తికి అవకాశమా..?

సహకారం కష్టమే..

వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా వీరాంజనేయులు నియమాకంపై పార్టీలోని దళిత నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎవరికో టిక్కెట్ ఇస్తే పనిచేసేందుకు తామేమీ వెర్రివెంగళప్పలం కాదని, తామేమిటో చూపిస్తామని ధిక్కారస్వరాన్ని వినిపిస్తున్నారు. ఇన్‌చార్జి నియామకం పార్టీ శ్రేణులను సైతం నిరాశపరిచిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలన్నీ ఒకెత్తయితే.. నియోజకవర్గంలో కీలకమైన పుట్లూరు, యల్లనూరు మండలాల్లో పార్టీ శ్రేణులు కొత్త ఇన్‌చార్జికి ఏ మేరకు సహకరిస్తాయన్న ప్రశ్న తలెత్తుతోంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డితో శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త ఆలూరు సాంబశివారెడ్డికి మధ్య పొసగడం లేదు. వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. సాంబశివారెడ్డి అనుయాయుడే నియోజకవర్గ ఇన్‌చార్జి కావడంతో పుట్లూరు, యల్లనూరు మండలాల్లో కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గం సహకరించడం అనుమానమే అంటున్నారు.

జగన్‌ను నిలదీస్తాం.. అడ్డుకుంటాం..!



కలెక్టరేట్ ఎదుట అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాభిషేకం.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్‌వాడీల నినాదాలు

అంగన్‌వాడీల హెచ్చరిక

అనంతపురం విద్య, జనవరి 19: తమ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సీఎం జగన్‌ను నిలదీస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అన్నారు. అంగన్‌వాడీలకు మద్దతుగా సీఎం జిల్లా పర్యటనను అడ్డుకుంటామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. సమ్మెలో భాగంగా శుక్రవారం 39వ రోజు జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగించారు. కలెక్టరేట్ వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మట్లాడుతూ, వందల కోట్లు ఖర్చుచేసి, ఎత్తైన విగ్రహాలు నిర్మించి సామాజిక న్యాయం, మహిళా సాధికార అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటం చేస్తోందని విమర్శించారు. ఇదంతా భూటకమని అన్నారు. సామాజిక న్యాయం కోసం అంబేడ్కర్ జీతితాంతం పోరాటం చేశారని అన్నారు. ఆయన విగ్రహం ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అంబేడ్కర్ చెప్పిన సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలకు ఈ ప్రభుత్వంలో న్యాయం జరగడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు జమున, అరుణ, జయభారతి, రుక్మిణి, ఐద్వా నేతలు సావిత్రి, రామాంజినమ్మ, సీపీఎం నాయకులు ఆర్వీనాయుడు, రామిరెడ్డి, సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, ముత్తుజా, రామాంజినేయులు, పోతులయ్య, ఆజాం బాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి కళ్లు మూసుకుని ఓటేస్తారు

బాబు ష్యూరిటీ.. కార్యక్రమంలో ఓ మహిళ



24వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, జనవరి 19: ఎన్నికల్లో ఈసారి ఓటర్లందరూ కళ్లు మూసుకుని మరో ఆలోచన లేకుండా టీడీపీకే ఓటు వేస్తారని, నిశ్చింతగా ఉండాలని ఓ మహిళ మాట్లాడటం టీడీపీ నాయకులకు ఆనందం కలిగించింది. పట్టణంలోని 24వ వార్డులో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు ఇన్‌చార్జి హనుమంతు నేతృత్వంలో టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచి మినీ మేనిఫెస్టోలోని ఆరు పథకాల గురించి వివరించారు. జితేంద్రగౌడు వార్డు ప్రజలతో మాట్లాడుతూ ముదు నెలల్లో జరిగే ఎన్నికలు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. రాష్ట్రానికి చీడలా దాపురించిన జగన్ బెడదను వదిలించుకోవడానికి ఇదే సరైన తరుణమన్నారు. టీడీపీకి ఓటు వేసి రాష్ట్రాన్ని గట్టెక్కించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్ కుమార్ గౌడు, నాయకులు అనిల్‌కుమార్ గౌడు, రామ్‌తేజ గౌడు, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, టీ కేశప్ప, కృపాకర్, గుడిపాటి ఆంజనేయులు, కురుబ చంద్రశేఖర్, శివన్న, రాయల్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరసనలపై

ఆంక్షలు సరికాదు

ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ భాస్కర్

అనంతపురం విద్య, జనవరి 19: రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల నిరసనలపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఏపీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ భాస్కర్ అన్నారు. వెలగపూడిలో ఉన్న రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో ఉద్యోగులు ర్యాలీలు, నినాదాలు, ధర్నాలు చేయకూడదని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వ వైఖరిని ఆయన ఖండించారు. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన తెలియజేయవచ్చునని ఆయన అన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల హక్కులు కాలరాసేలా ఆంక్షలు విధించడం అణచివేతకు దర్పణమని విమర్శించారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తే నిరసనలకు, పోరాటాలకు వెళ్లరని, ప్రభుత్వం వారి సమస్యలు పరిష్కరించకుండా ఇలా సర్క్యులర్ జారీ చేయడం తగదని, వెంటనే వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు అనంతపురంలో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తనిఖీల బాట..

వసూళ్ల వేట..!



సమగ్ర శిక్షలో హడలెత్తిస్తున్న అధికారి

చిన్న తప్పు దొరికినా ముడుపు కట్టాల్సిందే

ఒకే రోజు రూ.11 లక్షల వసూలు..?

అనంతపురం విద్య, జనవరి 19: అనంతపురం సమగ్రశిక్ష ప్రాజెక్టులో ఓ అధికారి వసూళ్ల వేట సాగిస్తున్నారు. వచ్చీరాగానే 'నేను యమ స్ట్రిక్ట్' అంటూ ప్రాజెక్టు ఉద్యోగులు, కేజీబీవీ సిబ్బందిని నెలన్నరపాటు ఉక్కిరిబిక్కిరి చేశారు. రాష్ట్ర కార్యాలయం నుంచి ఏదైనా రిపోర్ట్ అడిగితే ముందు తనకు చూపాలని, ఆ తరువాతే పంపాలని హుకుం జారీ చేశారు. తన అనుమతి లేనిదే చిన్న కాగితం కూడా బయటకు వెళ్లకూడదని ఆంక్షలు పెట్టారు. ఆ తర్వాత కేజీబీవీల తనిఖీల పేరిట హడావుడి ఆరంభించారు. ఒకే రోజు మూడు, నాలుగు, ఐదు కేజీబీవీలను తనిఖీ చేయడం, తప్పులు వెతికి భయాభ్రాంతులకు గురిచేయడం ఆయనకు పరిపాటిగా మారింది. 'సస్పెండ్ చేస్తా... మరో కేజీబీవీకి మార్చేస్తా' అని ఆయన బెదిరిస్తుంటారు. ఆ అధికారి మాటలకు సిబ్బంది గజగజ వణికిపోతారు. అప్పుడు ఆయన టార్గెట్స్ ఫిక్స్ చేస్తారు. రూ.75 వేలు, రూ.50 వేలు.. అని చెప్పి.. అందినకాడికి లాగేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్క రోజే కొందరు కాంట్రాక్టర్ల నుంచి ఏకంగా రూ.11 లక్షలు ముక్కు పిండి వసూలు చేశారని సమాచారం.

తనిఖీల పేరిట దందా

- సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి అయిన ఆయన.. తన విధుల్లో భాగంగా కేజీబీవీలను తనిఖీ చేయొచ్చు. లోపాలు ఉంటే సరిదిద్దుకోవాలని ఆదేశించవచ్చు. కానీ తనిఖీల పేరిట భయపెడుతూ వసూళ్లకు దిగుతున్నారని పలువురు వాపోతున్నారు. సాధారణంగా తనిఖీలు అంటే.. రోజుకు ఒకటి రెండు సెంటర్లకు వెళతారు. కానీ ఆయన సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఏకంగా ఐదు కేజీబీవీలనూ ఒకే రోజు చుట్టేస్తున్నారు. కేజీబీవీల్లో ఉద్యోగులు, ప్రిన్సిపాళ్ల తప్పులు వెతికి.. తనకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దొరికినవారిని టార్గెట్ చేసి, డబ్బులు గుంజుతున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.
- ఉరవకొండ నియోకవర్గంలోని ఓ కేజీబీవీలో జరిగిన నాడు-నేడు పనుల్లో అక్రమాలు జరిగాయని ఓ దర్యాప్తు సంస్థకు ఒకరు పిటిషన్ పెట్టారట. ఆ తరువాత ఆ పిటిషన్‌ను వెనక్కు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇది గతంలో జరిగిన సంఘటన. ఈ విషయం తెలుసుకున్న 'తనిఖీల అధికారి'.. వెంటనే రంగంలోకి దిగారట. 'అక్రమాలు జగరకుంటే ఎందుకు ఫిర్యాదు చేస్తారు..? మళ్లీ ఎందుకు పిటిషన్ వెనక్కు తీసుకుంటారు..? వెనక్కు తీసుకోండి అని మీరే చెప్పి ఉంటారు కదా...?' అని ప్రశ్నల వర్షం కురిపించి.. ఆ కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను బెదరగొట్టినట్లు సమాచారం. ఆ తర్వాత రూ.75 వేలు ఇవ్వాలని ఆ ప్రిన్సిపాల్‌కు టార్గెట్ ఫిక్స్ చేశారట.
- రాయదుర్గం నియోజవకర్గంలోని ఓ కేజీబీవీలో డబ్బులు లేకపోవడంతో.. పాఠశాలకు జమ అయిన ఇతర నిధులను ఉపయోగించి కేజీబీవీ భవనానికి తలుపులు వేయించారట. ఇది ఆలస్యంగా ఆయన చెవిలో పడింది. వెంటనే రంగంలోకి దిగి, 'ఆ ఫండ్స్ అలా ఎలా వాడుతారు..? మీరు తప్పు చేశారు..' అని ప్రిన్సిపాల్‌ను బెదరగొట్టి, మామూలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. డబ్బులు ఇవ్వకుంటే మరో కేజీబీవీకి బదిలీ చేస్తానని, లేదంటే సస్పెండ్ చేస్తానని బెదిరిస్తున్నట్లు తెలిసింది.



ఒక్క రోజే రూ.11 లక్షలు



ఇటీవల ఆ అధికారి ఒక్క రోజే ఏకంగా రూ.11 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం. కేజీబీవీలకు ప్రొవిజిన్స్, పాలు, గుడ్లు, ఇతర మెటీరియల్ సరఫరా చేస్తారు. చాలా కేజీబీవీలకు ఇండెంట్ మేరకు కాకుండా, కొంత తగ్గించి సరఫరా చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి వారిని ఆ అధికారి ఏమీ అనరని సమాచారం. సార్‌ను వారు ముందే ప్రసన్నం చేసుకుంటారట. ఇటీవల రెండు నెలల బిల్స్ చేసేందుకు కొందరు కాంట్రాక్టర్ల నుంచి ఒకే రోజు రూ.11 లక్షలు వసూలు చేశారని సమాచారం. ఈ వ్యవహారంపై ప్రాజెక్టు ఉద్యోగులు, కేజీబీవీ ఉద్యోగుల్లో విపరీతమైన చర్చ నడుస్తోంది. ఆ అధికారి మరీ బరితెగించి, ఇంత హడావుడిగా భారీ వసూళ్లకు తెగబడటానికి ఓ కారణం ఉందట. ఆయన మరికొన్ని నెలల్లో తట్టాబుట్ట సర్దుకుంటారట..! అందుకే దీపం ఉండగానే మామూళ్ల సర్దుకుంటున్నారని అంటున్నారు.

వేమన జయంతిని మరువడం దురదృష్టకరం

రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి ఆవేదన



వేమన విగ్రహం వద్ద మాట్లాడుతున్న నరేష్‌కుమార్ రెడ్డి

గాండ్లపెంట, జనవరి 19: వేమన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం మరచిపోవడం దురదృష్టకరమని రెడ్డిసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కటారుపల్లిలోని యోగివేమన ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. వేమన సమాధికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం జగన్ మోహన్‌రెడ్డి గతేడాది వేమన జయంతిని ఆర్భాటంగా నిర్వహించారన్నారు. అప్పటి సమావేశంలో పర్యాటక శాఖ మంత్రి రోజా ప్రతి యేడాది వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని హామీ ఇచ్చారన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం తరపున కనీసం పూలమాల వేసే వారు కూడా కరువయ్యారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి హరినాథ్‌రెడ్డి, నాయకులు నారాయణరెడ్డి, చవ్వా శ్రీనివాసరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, దాసిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేమన ఖ్యాతిని దశదిశలా చాటాలి

విగ్రహావిష్కరణలో వక్తలు



వేమన విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

పెనుకొండ, జనవరి 19: వేమన ఖ్యాతిని దశదిశలా వ్యాప్తి చేయడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం యోగివేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పోస్టాఫీసు సర్కిల్‌లో యోగివేమన విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేషాద్రిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ జాహ్నవి హాజరయ్యారు. స్థానిక రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో న్యాయవాది భాస్కర్‌రెడ్డి, విగ్రహదాత జయశంకర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డితో కలిసి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో జాహ్నవి మాట్లాడుతూ వేమన ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేయడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. అనంతరం అతిథులను సత్కరించారు.

మార్కెట్ ధరతో కందులు కొనుగోలు చేయండి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం టౌన్ జనవరి 19: మార్కెట్ ధరతో పౌరసరఫరాల శాఖద్వారా జిల్లాలో కందులు కొనుగోలు చేయాలని జాయింట్‌కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో జేసీ మాట్లాడుతూ దళారులను నమ్మి రైతులు మోసపోకుండా కందులు కొనుగోలు చేయాలన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని రైతులకు తెలియజేయాలని సూచించారు. రైతుభరోసా కేంద్రాలకు ఎరువులు సరఫరా చేయాలని ఆదేశించారు. రబీ పంటలకు సంబంధించి ఈ-క్రాప్ బుకింగ్, ఈకేవైసీ ప్రక్రియను వారంలోపు పూర్తి చేయాలన్నారు. తక్కువ నీటితో పండే చిరుధాన్యాలను రైతులు సాగుచేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమాశంకరమ్మ, పశుసంవర్ధకశాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, పౌరసరఫరాలశాఖ డీఎం రవీంద్ర పాల్గొన్నారు.

వేమనకు నివాళి

అనంతపురం టౌన్, జనవరి 19: యోగివేమన జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న జేసీ

చిన్నతప్పు జరిగినా శిక్ష తప్పదు

రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు, జేసీ, డీఆర్‌ఓ తదితరులు

అనంతపురం టౌన్, జనవరి 19: ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఏ చిన్న తప్పు జరిగినా శిక్ష తప్పదని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరు గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి, ఆర్డీఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటర్ల నుంచి వచ్చిన క్లెయిమ్స్ వందశాతం పరిష్కరించాలని సూచించారు. ప్రజాప్రతినిధులకు సంబంధించి జాబితాలో ఓటు ఉందా లేదా..? తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో నిబంధనల మేరకు మౌలిక వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఎక్కడైనా గొడవలు జరిగాయా అనేది ముందుగానే గుర్తించి అక్కడ గట్టి బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే గెలుపు ముఖ్యం.. ఎంపీ కాదు..

వైసీపీ పురం సమన్వయకర్త దీపిక వ్యాఖ్యలు

అధికార పార్టీలో దుమారం

దీపిక కార్యక్రమాలకు శాంత దూరం

హిందూపురం, జనవరి 19: వైసీపీ హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారం రేపుతున్నాయి. శుక్రవారం పట్టణ పరిధిలోని కొట్నూరులో దీపిక గడప గడపకు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని ఓ నాయకుడు హిందూపురం పార్లమెంటు ఇన్‌చార్జి శాంతను కూడా గెలిపించాలనీ, ఎంపీ కూడా ముఖ్యమని పేర్కొన్నారు. దీనికి దీపిక మాట్లాడుతూ.. 'మనకు ఎమ్మెల్యే ముఖ్యం.. ఎంపీ కాదం'టూ ఆ నాయకుడి మొహంపైనే చెప్పేశారు. దీంతో అక్కడున్న నాయకులు కొద్దిసేపు మిన్నకుండిపోయినట్లు తెలిసింది. శాంత హిందూపురంలోనే ఉన్నా దీపిక చేపట్టే కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వచ్చినపుడు మాత్రం వేదికపై కలిశారు తప్ప.. దీపిక చేపట్టే కార్యక్రమాలకు దూరంగా ఉండటం పార్టీలో చర్చనీయాంశమైంది. దీపిక చేసిన వ్యాఖ్యలు శాంతకు తెలియడంతో అధిష్టానం దృష్టికి తీసుకెళ్లేందుకు యోచిస్తున్నట్లు సమాచారం. దీపికను తీసుకొచ్చింది పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాగా.. శాంతను నేరుగా ముఖ్యమంత్రే తీసుకొచ్చినట్లు తెలిసింది. ఈ పరిస్థితుల్లో శాంత ఏ రకంగా దీనిపై స్పందిస్తారో.. వేచి చూడాలని వైసీపీలో కొంతమంది నాయకులు పేర్కొంటున్నారు.

బిందు సేద్య పరికరాలు బంద్

- ఎన్నికల భయంతో ఆపేసిన కంపెనీలు
- డబ్బు చెల్లించిన రైతులకూ మొండిచేయి
- జిల్లావ్యాప్తంగా వేలాది మంది రైతుల దరఖాస్తు

అనంతపురం అర్బన్



కరువు జిల్లాలో బిందు, తుంపర సేద్య పరికరాల సరఫరాను కంపెనీలు ఆపేశాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయన్న కారణంగా కంపెనీలు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమలైతే తమకు డబ్బులు అందవని, ఎన్నికల తరువాత పెండింగ్ డబ్బులు ఇస్తారన్న గ్యారెంటీ ఉండదని కంపెనీల ప్రతినిధులు సందేహిస్తున్నారు. డ్రిప్ పరికరాల కోసం రైతులు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించినా, సరఫరా చేయలేమని వారు అంటున్నారు. రెండు వారాల క్రితమే కంపెనీలు చేతులెత్తాశాయని సమాచారం. దీంతో జిల్లాలోని వేలాది మంది రైతులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సమయం ఉన్నా..

2023-24 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగుస్తుంది. నిబంధనల మేరకు మార్చి నెలాఖరు దాకా సూక్ష్మ సేద్య పరికరాల మంజూరుకు ఉత్తర్వులు ఇవ్వొచ్చు. కంపెనీలు వాటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ఎన్నికల బూచి చూపించి సరఫరాను కంపెనీలు నిలిపేశాయి. డిసెంబరు నెలాఖరు వరకు కొన్ని కంపెనీలు సరఫరా చేసినా, ప్రస్తుతం అన్ని కంపెనీలు మూకుమ్మడిగా నిలిపేశాయి.

వేలాది మందికి మొండిచేయి..

జిల్లాలో 32 డ్రిప్ కంపెనీలకు లక్ష్యాన్ని విధించి, పరికరాలు సరఫరా చేసే బాధ్యతలను అప్పగించారు. 2023-24 సంవత్సరానికి 12,500 హెక్టార్లకు పరికరాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఇప్పటి దాకా జిల్లావ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో 26,806 మంది రైతులు 34,830 హెక్టార్లకు పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. టార్గెట్‌కు మించి ఈ సారి రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. వీరిలో 9,360 మంది రైతులు 11,424 హెక్టార్లకు నాన్‌సబ్సిడీ డబ్బులు చెల్లించారు. ఇందులో 9,314 మంది రైతులకు 11,375 హెక్టార్లకు డ్రిప్ మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ ఇప్పటి దాకా 6,573 మంది రైతులకు 7,976 హెక్టార్లకు మాత్రమే పరికరాలను సరఫరా చేశారు. మిగిలిన రైతులకు మొండిచేయి చూపించారు.

పంపిణీ కొనసాగించాలి..

కరువు జిల్లాలో డ్రిప్ పరికరాల సరఫరాను ఉన్నట్టుండి నిలిపేయడం దారుణం. ఎన్నికలు సమీపిస్తున్నాయన్న కారణంతో కంపెనీలు ఇలా చేస్తే రైతుల పరిస్థితి ఏమిటి? పరికరాలు అందుతాయని పంటల సాగుకు సిద్ధమైన రైతులకు ఏం సమాధానం చెబుతారు? ప్రభుత్వం జోక్యం చేసుకుని, కంపెనీలకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలి. అర్హులైన రైతులందరికీ డ్రిప్ పరికరాలు సరఫరా చేసేలా చేయాలి. లేకపోతే రైతుల పక్షాన పోరాడుతాం.



\- చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

ఎన్నికలతో సంబంధం ఏమిటి..?

రైతులకు డ్రిప్ పరికరాలు సరఫరా చేయడానికి, ఎన్నికలకు ఏం సంబంధం? డ్రిప్ కోసం నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించిన రైతులందరికీ ఈ ఆర్థిక సంవత్సరంలోగా పరికరాలు సరఫరా చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వంపై నమ్మకం లేకనే కంపెనీలు చేతులెత్తేశాయి. కంపెనీలకు పెండింగ్ డబ్బులు చెల్లించి, వాటికి నమ్మకం కలిగించాలి. రైతులకు డ్రిప్ పరికరాలు అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.



\- లక్ష్మీనారాయణరెడ్డి, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, జనవరి 19: జిల్లాలోని గుంతకల్లు, అనంతపురం సబ్ డివిజన్ల పోలీసులు హౌస్ బ్రేకింగులకు పాల్పడే ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలతోపాటు 11 మందిని అరెస్ట్ చేశారు. రూ.30లక్షల విలువైన 30తులాల బంగారు, 920 గ్రాముల వెండి వస్తువులు, రూ.9,83,300 నగదు, 3.5తులాల గంజాయి, కారు, ఏడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అన్బురాజన్ అరెస్ట్ వివరాలను వెల్లడించారు. గుంతకల్లు సబ్ డివిజన్‌లోని ఉరవకొండ రూరల్ పోలీసులు కర్ణాటక రాష్ట్రం బాదామి జిల్లాకు చెందిన సతీష్‌గౌడ, కోప్పాళ్‌కు చెందిన రాజాసాబ్, గదగ్ జిల్లాకు చెందిన పరశురాంను అరెస్ట్ చేశారు. బెళుగుప్ప, ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, బొమ్మనహాళ్ ప్రాంతాలతోపాటు రాయచూరు, బీజాపూర్‌లలో హౌస్ బ్రేకింగ్‌లకు వీరు పాల్పడ్డారు. వీరిపై ఇదివరకే 8 కేసులు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో ఉన్నాయి. గుంతకల్లు డీఎస్పీ పర్యవేక్షణలో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, బెళుగుప్ప ఎస్ఐ శివ ఆధ్వర్యంలో సిబ్బంది బృందంగా ఏర్పడి శుక్రవారం గుండ్లపల్లి క్రాస్ వద్ద వీరిని అరెస్ట్ చేశారు.

ఆరు బైక్‌లు స్వాధీనం: ఒకరి అరెస్ట్

గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు తిమ్మప్పను అరెస్ట్ చేసి ఆరు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. నకిలీ తాళాల సహాయంతో ఇళ్ల ముందున్న బైక్‌లను దొంగలించేవాడు. వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్యకు అందిన సమాచారం మేరకు శుక్రవారం సిబ్బందితో రైల్వేస్టేషన్ ఎక్స్ సర్కిల్‌లో అరెస్ట్ చేశారు.

గంజాయి, మట్కాతో సంబంధమున్న ఏడుగురి అరెస్ట్

మట్కా, గంజాయితో సంబంధమున్న ఏడుగురిని అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన చలపతి, గోవిందరాజులు, ఎన్టీఆర్ కాలనీకి చెందిన సుధాకర్, షికారి బాలచంద్ర, అశోక్ నగర్ మూడో క్రాస్‌కు చెందిన సెల్వా గణపతి, ఆదర్శనగర్‌లోని కొత్తకాపు జయసుధ, బుక్కరాయసముద్రం వీరభద్రకాలనీలోని నాగయ్యలను అరెస్ట్ చేశారు. వీరిలో చలపతి, గోవిందరాజులుకు మట్కా నిర్వహణ, గంజాయితో సంబంధాలున్నాయి. చలపతిపై మట్కా కేసులున్నాయి. వీరి నుంచి రూ.9,83,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరు మిగిలిన ఐదుగురితో గంజాయి విక్రయాలు చేసేవారు. కొత్త కాపు జయసుధ విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయి తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకొచ్చి విక్రయాలు జరిపేది. వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ఏడుగురిని అరెస్ట్ చేశారు. సమావేశంలో గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, జిల్లా స్పెషల్ బ్రాంచి, ఉరవకొండ రూరల్, గుంతకల్లు వన్‌టౌన్ సీఐ, వన్‌టౌన్ సీఐలు జాకీర్‌హుస్సేన్, ప్రవీణ్‌కుమార్, రామసుబ్బయ్య, రెడ్డప్ప, బెళుగుప్ప ఎస్ఐ శివ పాల్గొన్నారు.

నియామకం

అనంతపురం అర్బన్, జనవరి 19: టీడీపీ ప్రొఫెషనల్స్ విభాగం జిల్లా అధ్యక్షుడిగా తాడిపత్రి నియోజకవర్గానికి చెందిన పేరం శ్యాంసుందర్‌రెడ్డిని నియమించారు. ఆ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కళ్యాణదుర్గం నియోజకవర్గానికి చెందిన రాఘవేంద్రను ప్రకటించారు. శుక్రవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు.

రైళ్లకు తాత్కాలిక స్టాపింగ్స్

గుంతకల్లు, జనవరి 19: రైల్వేజోన్‌కు చెందిన పలురైళ్లను గుంతకల్లు రైల్వే డివిజన్‌లోని పలు స్టేషన్లలో తాత్కాలిక స్టాపింగ్స్‌ను కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముంబై-మధురై (నెం. 22101) రైలుకు గుత్తిలోనూ, కాచిగూడ-చెంగల్పట్టు (నెం. 17652) ఎక్స్‌ప్రెస్‌కు కోడూరులోనూ, నాగర్‌కోయిల్-ముంబై (నెం. 16352) ఎక్స్‌ప్రెస్‌ను యర్రగుంట్లలోనూ, మధురై-ముంబై (నెం. 22102) రైలుకు రాజంపేటలో స్టాపింగ్ కల్పించనున్నామని పేర్కొన్నారు. ముంబై-కరైకల్ (11017) రైలుకు గుత్తి, తాడిపత్రిలోనూ, తిరుపతి-ఔరంగాబాద్ (నెం. 17622), మధురై-చెన్నై సెంట్రల్ (నెం. 22179) ఎక్స్‌ప్రెస్‌లకు ఆదోనిలోనూ, యశ్వంతపూర్-లక్నో (నెం. 22683) ఎక్స్‌ప్రెస్‌కు అనంతపురంలో స్టాపింగ్ ఉంటుందని వివరించారు. స్టాపింగ్‌లు శుక్రవారం నుంచి ఆరునెలలపాటు అమలులో ఉంటాయని తెలిపారు.

రేపు మూర్ఛవ్యాధి వైద్యశిబిరం

అనంతపురం కల్చరల్, జనవరి 19: జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జేవీవీ జిల్లా కార్యాలయంలో మూర్ఛవ్యాధి బాధితులకు వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు జేవీవీ కన్వీనర్ రామకృష్ణ, నగరాధ్యక్షుడు రామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి విజయవాడ నుంచి ప్రముఖ న్యూరాలజిస్టు డాక్టర్ శివన్నారాయణ హాజరై వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి చిరుధాన్యాల పండుగ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19: 'మన పంటలు-మన వంటలు' నినాదంతో శనివారం నుంచి అనంత చిరుధాన్యాల పండుగ ప్రదర్శన జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ వైవి మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు అనంత చిరుధాన్యాల పండుగ-2024 ఉంటుందన్నారు. శనివారం చిరుధాన్యాలతో ఆరోగ్యం, సాగు అంశాలపై సదస్సు, ఆదివారం సాగులో మెళకువలు, సహభాగ ధృవీకరణ పద్ధతి, స్వల్పకాలిక చిరుధాన్యాల రకాల సాగుపై అవగాహన ఉంటుందన్నారు. 22వ తేదీ చిరుధాన్యాల ప్రాసెసింగ్-విలువ ఆధారిత ఉత్పత్తులు అంశంపై శాస్త్రవేత్తలు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

సంఘటితంగా సాధించుకుందాం

మహాసమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణలో నాయకులు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, జనవరి 19: జనాభా దామాషా ప్రకారం దక్కాల్సిన ఆర్థిక, రాజకీయ, విద్య, వైద్య, సంక్షేమాన్ని సంఘటితంగా సాధించుకుందామని దళిత సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగల మహాసమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘం నాయకులు బంగినాగ మాట్లాడుతూ జిల్లాలో మాదిగల జనాభా అధిక సంఖ్యలో ఉన్నా అన్నిరంగాల్లో వెనుకబడటానికి ఐక్యత లోపించడమే కారణమన్నారు. అందరూ ఏకతాటిపై నడిచి భవిష్యత్తు నిర్మాణ సాధనకోసం మహాసమ్మేళనం నిర్వహించడం జరగుతోందని పేర్కొన్నారు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో 31న నిర్వహించే మాదిగల మహాసమ్మేళన సదస్సును విజయవంతం చేయాలని కోరారు అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు బీసీఆర్ దాస్, కేపీ నారాయణ స్వామి, సాకే శివకుమార్, సామ్రాట్ మధు, సర్పంచ్ బంగిమల్లేష్, దాసగాని కుళ్లాయప్ప, ఎల్లన్న, కదిరప్ప, చంద్ర, కేశవ, బడిగిరాజు, చెన్నప్ప, హర్షవర్ధన్, శాంతమ్మ, శంకర్, హర్షవర్ధన్, పృథ్వీ, పవన్‌కుమార్, నగేష్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరయాదవ్



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

గుత్తి, జనవరి 19: బీసీలకు రాజ్యాధికారంలో తగిన ప్రాధాన్యత ఇవ్వకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ నాగేశ్వరయాదవ్ అన్నారు. శుక్రవారం గుత్తిఆర్ఎస్‌లో పత్తికొండ రోడ్డు సర్కిల్‌లోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం రథయాత్రను చేపట్టామన్నారు. జనాభా దామాషా ప్రకారం 90 అసెంబ్లీ, 13 పార్లమెంట్ స్థానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగానే బీసీ అట్రాసిటీ చట్టాన్ని అమలు పరచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు లకా వెంగళరావు, మహిళా అధ్యక్షురాలు నూకాలమ్మ, కర్నూలు జిల్లా అధ్యక్షుడు మురళి, నాయకులు రంగారెడ్డియాదవ్, వెంకటశివుడు, ఆనంద్, న్యాయవాది రమేష్, కృష్ణ, రాము, పవన్, శేఖర్, మహేష్, హరిచంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి అరటి తోట ధ్వంసం

పుట్లూరు, జనవరి 19: మండలంలోని కుమ్మనమల గ్రామంలో టీడీపీ నాయకుడు ఓబన్న అరటి తోటను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అరటి తోటలో గెలలను శుక్రవారం తెల్లవారుజామున నరికివేశారు. ఓబన్న మొత్తం ఐదు ఎకరాలలో అరటి తోటను సాగు చేశాడు. ఓబన్న శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు తోట వద్దకు వెళ్లేసరికి నరికివేసిన అరటిగెలలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. తోటలో ఆరు వేల చెట్లు ఉండగా, 800 పైగా అరటి గెలలను నరికివేశారు. నెలరోజుల్లో చేతికి వచ్చే పంటను నరికివేయడంతో ఓబన్న కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అరటి సాగుకు రూ.6.50 లక్షలు పెట్టుబడి పెట్టామని, పంట చేతికి వచ్చే సమయంలో నరికివేయడం దారుణమని వాపోయారు. సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ దిలీప్‌కుమార్ అరటితోటను పరిశీలించారు. బాధిత రైతుతో మాట్లాడి అనుమానితుల గురించి ఆరాతీశారు. డాగ్‌స్క్వాడ్‌తో అరటితోటలో తనిఖీలు నిర్వహించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



నరికివేసిన అరటి గెలలు

నలుగురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం, జనవరి 19: ఉమ్మడి జిల్లా పరిధిలో నలుగురు సీఐలను బదిలీ చేశారు. శుక్రవారం అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్, ఎస్పీ, అనంతపురంలో ఉన్న సీఐ ఎం.శ్రీనివాసులును రాయదుర్గం యూపీఎస్‌కు బదిలీ చేశారు. రాయదుర్గం రూరల్ సర్కిల్‌లో ఉన్న వీ యుగంధర్‌ను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ సర్కిల్‌కు బదిలీపై పంపారు. పెనుకొండ సర్కిల్ సీఐ పీ రాజారమేష్‌ను శ్రీసత్యసాయి జిల్లా, ఎస్పీ, వీఆర్‌కు, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ, వీఆర్‌లో ఉన్న సీఐ జే ప్రసాద్‌బాబును రాయదుర్గం రూరల్ సర్కిల్‌కు బదిలీ చేశారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నిర్వాహకుల అరెస్ట్

పెనుకొండ టౌన్, జనవరి 19: పట్టణంలోని వ్యభిచార గృహంపై గురువారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించి పదిమందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణ శివారులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడిచేసి ఓ మహిళ, ఆరుగురు విటులు, ముగ్గురు నిర్వాహకులను పట్టుకోవడం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి తొమ్మిది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిర్వాహకులపై కేసునమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. పట్టుబడ్డ మహిళ, ఆరుగురు విటులకు నోటీసులు అందించి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపినట్లు వివరించారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న గ్రామస్థులు



వాహనాలను అడ్డుకుంటున్న గ్రామస్థులు

అనంతపురంరూరల్, జనవరి 19: మండలంలోని నరసనాయనికుంటలో అక్రమంగా మట్టి, రాళ్లను తరలిస్తున్న వాహనాలను గ్రామస్థులు శుక్రవారం అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా గ్రామ సమీపంలోని కొండ గుట్టల నుంచి మట్టిని, రాళ్లను పలు వాహనాల్లో తరలిస్తున్నారని, శుక్రవారం ఆ వాహనాలను అడ్డుకున్నామని, వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలూ లేవని తెలిపారు. దీనిపై వారిని నిలదీయగా.. వాహనదారులు ఆ మట్టిని, రాళ్లను అక్కడే పారేసి వెళ్లినట్లు చెప్పారు.

పంపుసెట్లకు మీటర్లు వద్దు: సీపీఐ



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ, రైతు సంఘం నేతలు

బుక్కరాయసముద్రం: వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే ఆలోచనను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ, రైతు సంఘం నేతలు నిరసన చేపట్టారు. మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలకు రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గి రైతులపై పెను భారం మోపేందుకు సిద్ధమైందన్నారు. ఉచిత విద్యుత్ పథకాన్ని ఎత్తివేసి నగదు బదలీ పథకం అమలుతో రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించరాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్, మధుయాదవ్, మునీర్, రామక్రిష్ణ, తిరుపతయ్య పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు

అనంతపురంరూరల్: మండలంలోని రుద్రంపేటలోని న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్, ఎస్ఎంఆర్ ఆగ్రో ఏజెన్సీ దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. న్యూ శ్రీనివాస ఫర్టిలైజర్స్ దుకాణంలో స్టాక్ బుక్ నందు నిల్వలు అప్‌డేట్ లేని కారణంగా రూ.1.25 లక్షల విలువైన ఎరువులను జప్తు చేశారు. ఎస్ఎంఆర్ ఆగ్రో ఏజెన్సీలో ప్రిన్సిపల్ సర్టిఫికేట్ లేని కారణంగా ఎనిమిది రకాల కంపెనీలకు సంబంధించిన రూ.1.53 లక్షల విలువ చేసే వాటికి స్టాప్ సేల్ నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు వాసుప్రకాష్, ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, సిబ్బంది మండల వ్యవసాయాధికారి సాయి లక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వర వైభవ సప్తాహం

అనంతపురం కల్చరల్ : సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం నుంచి ఈనెల 26 వరకు వెంకటేశ్వర వైభవ సప్తాహం నిర్వహిస్తున్నట్లు సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తికి చెందిన ఆధ్యాత్మికవేత అన్నాజి హాజరై ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సప్తాహం చేస్తారన్నారు. భక్తులు విరివిగా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

టీవీ మెకానిక్ ఆత్మహత్య

అనంతపురం క్రైం: మద్యానికి బానిసైన వేణుగోపాల్‌నగర్‌కు చెందిన టీవీ మెకానిక్ నాగరాజు (35) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా అతను తాగుడుకు బానిసగా మారాడు. అతని భార్య కోర్టులో పనిచేస్తున్నారు. తరచూ మద్యం తాగడానికి డబ్బు అడుగుతుండటంతో కుటుంబసభ్యులు ఇచ్చేవారు కాదు. శుక్రవారం సాయంత్రం మరోసారి డబ్బులు లేవని కుటుంబ సభ్యులు చెప్పడంతో.. జీవితంపై విరక్తి చెందిన అతను ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

మహిళ అదృశ్యం

నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్న బోయ మహేంద్ర, లావణ్య స్థానిక జనశక్తినగర్‌లో ఉంటున్నారు. లావణ్య ఇళ్లల్లో పనిచేసేది. సంక్రాంతి పండుగ రోజున భార్యాభర్తలు గొడవపడ్డారు. గురువారం ఉదయం పనికి వెళ్లిన లావణ్య సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం బంధువుల ఇళ్లల్లో మహేంద్ర గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మహేంద్ర నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశాడు.

ఇద్దరికి గాయాలు

బుక్కరాయసముద్రం: మండలంలోని దేవరకొండ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్దరాంపురానికి చెందిన ఆనంద్, రవి తీవ్రంగా గాయపడ్డారు. వీరు ఒకే బైక్‌లో అనంతపురం నుంచి స్వగ్రామానికి వస్తుండగా... దేవరకొండ వద్ద ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొంది. కిందపడ్డ వీరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆనంద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

అనంతపురంరూరల్ : నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండబోదని విద్యుత్ శాఖ టౌన్-1 డీఈఈ నాగేంద్ర తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హౌసింగ్‌బోర్డు, నవోదయ కాలనీ, బెంగుళూరు రోడ్డు, హమాలీ కాలనీ, భైరవనగర్, శారదనగర్, బుడ్డప్ప నగర్, ఎస్‌బీఐకాలనీ, ఆర్‌కే కాలనీప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

'ఉద్యోగుల స్పందన'కు 16 ఫిర్యాదులు

అనంతపురం టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం కోసం శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ప్రత్యేక స్పందనను డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ నిర్వహించారు. మొత్తం 16 ఫిర్యాదులు వచ్చాయని, వాటిని త్వరగా పరిష్కరించాలని ఆయాశాఖల ఉన్నతాధికారులకు ఆదేశించామని తెలిపారు.

పేరూరులో దివ్యాంగులకు న్యాయసేవా సదస్సు

రామగిరి : మండలంలోని పేరూరు గ్రామంలో టింబక్టు కలెక్టివ్ సహకారంతో ప్రతిభాసొసైటీ ఆధ్వర్యంలో వికలాంగుల కోసం న్యాయసేవాసదస్సును శుక్రవారం నిర్వహించారు. మేనరికపు వివాహాలతో కలిగే ఇబ్బందుల గురించి తెలియజేశారు. మహిళలపై వివక్ష, వికలాంగుల చట్టాలపై చిన్ననాటిక రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రతిభా సొసైటీ సీఈఓ నరసింహులు, డైరెక్టర్ బాబన్న, టీం సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి

మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురంరూరల్, జనవరి 19: తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని మాజీ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాపంపేట పంచాయతీ బసవతారక నగర్, వీకే నగర్‌లో బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి.. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధి తప్పా.. వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధి శూన్యమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, ఎంపీపీ మాధవి, మండల ప్రధాన కార్యదర్శి పాముర్రాయి రఘు, మాజీ మండల కన్వీనర్లు లక్ష్మీనారాయణ, పాముర్రాయి వెంకటేష్, జయకృష్ణ, నాయకులు తాడాల నాగభూషణం, రామాంజినేయులు, లింగయ్యయాదవ్, శ్రీరాములు, బాబావలి, గోవిందు, దస్తగిరి, వెంకటస్వామి, కురుగుంట నారాయణస్వామి, గంగాధర్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు జెట్టి భరత్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హరీష్‌రెడ్డి, రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షులు మద్దినేని కృష్ణ, తెలుగు మహిళలు రామసుబ్బమ్మ, సాలమ్మ, మంజుల, స్వప్న, రామాంజినమ్మ, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

'వాల్మీకి బోయ' కమిటీ జాబితా విడుదల

రాప్తాడు నియోజకవర్గం వాల్మీకి బోయ సాధికార ఫెడరేషన్ కమిటీ జాబితాను మాజీ మంత్రి పరిటాల సునీత తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. అధ్యక్షుడిగా ఆత్మకూరు ఓబుళపతి, ఉపాధ్యక్షులుగా లింగమయ్య, సాకే బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్, అధికార ప్రతినిధులుగా నారాయణస్వామి, రాము, జయసింహ, ఆదినారాయణ, దాదులూరు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అక్కులప్ప, లింగమయ్య, నాగరాజు, ఓబిలేసు, వెంకటేష్, కార్యదర్శులుగా వెంకప్ప, నారాయణప్ప, నాగభూషణ, సుధాకర, ముత్యాలప్ప, బండి మధు, శివకుమార్, చెన్నప్ప, చిరంజీవి, అనిల్ కుమార్, సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా లింగన్న, కోశాధికారిగా చిన్న రాజును నియమించారు. ఆమె మాట్లాడుతూ.. వాల్మీకులు ఒకసారి జగన్‌ని నమ్మి మోసపోయారని, వాల్మీకులకు ఏం చేశారో చెప్పే ధైర్యం కూడా వైసీపీ వారికి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రంగయ్య, ఆత్మకూరు, కనగానపల్లి మండల కన్వీనర్లు శ్రీనివాసులు, పోతలయ్య పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ బస్సు జాత పోస్టర్ విడుదల

తెలుగుదేశం పార్టీ అనుబంధ కమిటీ టీఎన్‌టీయూసీ బస్సు జాత పోస్టర్‌ను మాజీ మంత్రి పరిటాల సునీత స్థానిక తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విడుదల చేశారు. కార్మికుల సమస్యలను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు తాడాల నాగభూషణం, జిల్లా కార్యదర్శి రాజురాయల్, అశోక్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ బాబాఫక్రుద్దీన్, జావిద్, రాప్తాడు నియోజకవర్గం అధికార ప్రతినిధి సురేష్‌బాబు, ముత్యాలు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పటాన్ సైపుల్లాఖాన్, సాంబశివ, వైస్‌ప్రెసిడెంట్ నరసింహులు, సుబ్బు, మండల అధ్యక్షులు రాంబాబు, టీడీపీ నాయకులు రాము, వీరనారప్ప, మల్లికార్జున, చిరంజీవి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

తెలుగుదేశం పార్టీలోకి భైరవ బిల్డర్ గాండ్ల నాగరాజు టీడీపీలోకి చేరారు. శుక్రవారం రాత్రి మండలంలోని కక్కలపల్లి కాలనీ పంచాయతీ పరిధిలో ఆయన నివాసంలో మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో పార్టీలోకి చేరారు.



బసవతారక నగర్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

వేమనను విస్మరించిన ప్రభుత్వం

యోగి వేమన రెడ్డి సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి





మాట్లాడుతున్న యోగివేమన రెడ్డి సేవాసంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, వేమన చిత్రపటాలను ఆవిష్కరిస్తున్న వేమన ఫౌండేషన్ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్, జనవరి 19: విశ్వకవిగా గుర్తింపు పొందిన యోగి వేమనను.. ఆయన సొంత రాష్ట్రంలో ప్రభుత్వం తగినంత గుర్తింపు ఇవ్వకుండా విస్మరించడం శోచనీయమని యోగి వేమన రెడ్డి సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. యోగివేమన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఎదురుగా యోగి వేమన కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణరెడ్డి మాట్లాడుతూ... ఇకనుంచైనా వేమన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్రప్రభుత్వమే అధికారికంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త విశ్వనాథరెడ్డి, కోశాధికారి వడ్డుపల్లి గోపాల్‌రెడ్డి, సభ్యులు సూర్యనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ఎల్ఐసి వెంకటేశ్వరరెడ్డి, అనంత సాహితీ ప్రస్థానం ట్రస్టు అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, రూట్స్ గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, బీఎస్ఎన్ఎల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

వేమన ఫౌండేషన్ కార్యాలయంలో...

వేమన జయంతిని పురస్కరించుకుని శుక్రవారం వేమన ఫౌండేషన్ కార్యాలయంలో ఇటీవల రూపొందించిన వేమన చిత్రపటాలను ఆవిష్కరించారు. వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత జాయింట్ కలెక్టర్ మనోహర్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ యువపురస్కార గ్రహీత అప్పిరెడ్డి హరినాథరెడ్డి, విశ్రాంత రిజిస్ట్రార్ రవీంద్ర రాజు, ఆచార్య రవీంద్రరెడ్డి, కవులు కంబదూరు షేక్ నబిరసూల్, వన్నూరుసాబ్, మధురశ్రీ, ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, రమేష్, ఫౌండేషన్ సభ్యులు జలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో...

అనంతపురం సెంట్రల్ : వేమన జయంతిని విశ్వవిద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఎస్కేయూలో వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ క్రిష్ణకుమారి, ప్రొఫెసర్ బాలసుబ్రమణ్యం, ప్రధాన వక్త పతికి రమేష్ నారాయణ, జేఎన్‌టీయూలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్, డైరెక్టర్లు, ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి, అధ్యాపకులు వేమనకు నివాళులర్పించారు.

రైతులను విస్మరించిన వైసీపీ

టీడీపీ శింగనమల నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ



మదిరేపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న బండారు శ్రావణిశ్రీ

శింగనమల, జనవరి 19: వైసీపీ ప్రభుత్వం రైతులను ఏ మాత్రం పట్టించుకోకుండా పూర్తిగా విస్మరించిందని టీడీపీ శింగనమల నియోజకవర్గం ఇన్‌చార్జ్ బండారు శ్రావణిశ్రీ ధ్వజమెత్తారు. శుక్రవారం శింగనమల మండలంలోని మదిరేపల్లిలో శుభోదయం, పొలంబాట కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. పంట పొలాల్లో రైతులు, వ్యవసాయ కూలీలతో మాటామంతి నిర్వహించారు. రాయితీలు, గిట్టుబాటు ధర కల్పించకుండా రైతులను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు మోసం చేసిందని, ఇక ఆ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అన్ని వర్గాల ప్రజలూ సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకలు రహింతుల్లా, వెంకటరమణ, చితంబరిదొర చిందనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, జీసీ బాబు, వీరానారాయణ, బోయసత్తి, రాజశేఖర్ యాదవ్, మణిరత్నం, నారాయణస్వామి తిరుపాలు, పెద్ద ఎత్తున టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విగ్రహం పెడితే.. జగన్ దురాగతాలు పోతాయా?



మాట్లాడుతున్న అక్కులప్ప

అనంతపురం సెంట్రల్, జనవరి 19: అంబేడ్కర్ విగ్రహం పెట్టిన వ్యాత్రానా.. సీఎం జగన్ ఐదేళ్లుగా ఎస్సీ, ఎస్టీలపై సాగించిన దురాగతాలు మాయమౌతాయ అని ఎస్సీ, ఎస్టీ రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప ప్రశ్నించారు. శుక్రవారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... అట్రాసిటీ చట్టాన్ని ఎస్సీ, ఎస్టీలపైనే ప్రయోగించిన దుర్మార్గపు ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో నిలిపోయాడన్నారు. గత ప్రభుత్వాలిచ్చిన అసైన్డ్ భూములను లాక్కోవడమే కాకుండా శ్మశాన వాటికలను, వంశపారంపర పొలాలను, ఇళ్లస్థలాలను సైతం కబ్జాచేశారని ధ్వజమెత్తారు. కార్పొరేషన్లను నిర్వీర్యంచేసి సంక్షేమ పథకాలను రద్దు చేసి ఎస్సీ, ఎస్టీల వర్గాలపై కక్షను తీర్చుకున్నారన్నారు. అలాంటి వ్యక్తిగా అంబేడ్కర్ పేరును ఉచ్చరించడానికి జగన్ అనర్హుడన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బటన్ నొక్కి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, చెన్నప్ప, సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఓట్ల కోసమే అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు

అనంతపురం అర్బన్, జనవరి 19: దళితుల ఓట్లు దండు కోవడం కోసమే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం జగన్ ఏర్పాటు చేశారని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మండిపడ్డారు. శుక్రవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో ఆ విభాగం నాయకులు వెంకటేష్, రామాంజినేయులు, వన్నూరప్ప మాట్లాడుతూ... వైసీపీ పాలనలో దళితులపై హత్యలు, దాడులు పెరిగిపోయాయన్నారు. ఎన్నికల సమయంలో దళితుల ఓట్ల కోసం జగన్ వేస్తున్న డ్రామాలను ఆ వర్గాల ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవన్‌కుమార్, సుజాతమ్మ, గోపాల్ పాల్గొన్నారు.

అధ్యాపకుల సమస్యలు పరిష్కరించండి



వీసీకి అభినందలు తెలుపుతున్న చెన్నకేశవులు

అనంతపురం సెంట్రల్, జనవరి 19: ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (పీటీఎల్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. వీసీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయనుకు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపిన చెన్నకేశవులు.. సమస్యలపై వినతి పత్రం అందజేశారు. చాలీచాలని వేతనాలతో అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారని, యూజీసీ నిబంధనల మేరకు వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట నాయకులు కల్లప్ప, తిప్పారెడ్డి, వెంకటేష్ ఉన్నారు.

రేపట్నుంచి ఆర్డీటీ అల్ట్రామారథాన్

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 19: ఆర్డీటీ తొమ్మిదవ ఎడిషన్ అల్ట్రామారథాన్ ఆదివారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ తెలిపారు. ఆదివారం ఉదయం 7గంటలకు కలెక్టరేట్ వద్ద నుంచి అనంత క్రీడాగ్రామం వరకు 10కె రన్, 5కె వాక్, 9.30 గంటలకు ఆర్డీటీ స్టేడియంలో కమ్యూనిటీ రన్ నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, విదేశీయులు పాల్గొంటారన్నారు. మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కుందుర్పిలో ప్రారంభించే అనంతపూర్ అల్ట్రా మారథాన్ బుధవారం బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి వరకు సాగుతుందన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

రాష్ట్రంలో శాస్త్రీయ అభివృద్ధి అవసరం: జేవీవీ

అనంతపురం కల్చరల్, జనవరి 19: రాష్ట్రంలో అశాస్త్రీయమైన అభివృద్ధి కాకుండా శాస్త్రీయ ఆలోచనలతో కూడిన అభివృద్ధి అవసరమని మాజీ ఎమ్మెల్సీ, జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ అన్నారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో సంగమేష్ సర్కిల్‌లోని జేవీవీ కార్యాలయంలో గుంటూరులో జరగనున్న జేవీవీ రాష్ట్ర సదస్సు బ్రోచర్లను ఆవిష్కరించిన ఆయన మాట్లాడారు. 2023 నవంబరు 7 నుంచి 2024 ఫిబ్రవరి వరకు రాష్ట్రవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథంపై కళాజాతను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఆదివారం గుంటూరులో 'ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ అభివృద్ధి' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లో నెలకొన్న వెనుకబాటుతనాన్ని తొలగించి, శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించే అనేక అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జిలాన్‌బాషా, నగర కమిటీ నాయకులు రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ, ప్రసాద్ పాల్గొన్నారు.

దొంగ ఓట్లపై విచారణ చేపట్టాలి

అనంతపురం విద్య, జనవరి 19: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జరిగిన దొంగ ఓట్ల నమోదుపై కూడా ఎన్నికల కమిషన్ విచారణ చేపట్టాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఒంటేరు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల ఎన్నికల కమిషనర్ కఠిన చర్యలకు దిగడం శుభపరిణామమని, ఇదే తరహాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నకిలీ ఓటర్ల నమోదు జాబితాను పునః పరిశీలించాలని కోరారు. ఎన్నికల్లో అధికారపక్షం అధికార దుర్వినియోగానికి పాల్పడి, ఇబ్బడి ముబ్బడిగా ప్రైవేట్ స్కూళ్ల సిబ్బందిని ఓటర్లుగా చేర్పారన్నారు. గతంలో తాను అనేక అభ్యంతరాలు చేసినా పట్టించుకోలేదన్నారు. ఆ కారణంగా అప్రజాస్వామికంగా స్వల్ప మెజార్టీతో ఓటమి చెందాల్సి వచ్చిందని, దీనికి నకిలీ ఓట్ల ప్రభావమేనని అన్నారు. అడ్డదారులు తొక్కి, ఉన్నతాధికారులను సైతం బదిలీ చేసి టీచర్లుగా అర్హత లేని వారిని కూడా ఓటర్లుగా చేశారన్నారు. పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అధికార పక్షంచేసిన అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలని, అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అప్పటి ఎన్నికను రద్దుచేయాలని, మళ్లీ నోటిఫికేషన్ జారీ చేయాలని ఆయన ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ రాజ్యాంగం ఖూనీ

- ఓట్ల కోసమే విగ్రహ ఏర్పాటు
- అంగన్‌వాడీల ఆగ్రహం

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్: ఇచ్చిన హామీని అమలు చేయాలని శాంతియుతంగా కోరిన తమపై ఎస్మా ప్రయోగించి అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని సీఎం జగన్‌రెడ్డి ఖూనీ చేశారని అంగన్‌వాడీలు మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓట్ల కోసం నేడు అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించడంలో మీ చిత్తశుద్ధి ఏమిటో ప్రజలందరూ గమనిస్తున్నారని, రానున్న ఎన్నిక ల్లో ఓటుతో తగిన బుద్ధి చెబుతారని ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎస్మాకు బదులు పత్రాలను అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు అందజేసి నిరసన వ్యక్తం చేశారు. శింగనమల తహసీల్దార్ కార్యాలయం నుంచి అంగన్‌వాడీలు పెద్దఎత్తున జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆర్‌టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఎస్మా బదులు పత్రాలతో నిరసన తెలిపా రు. చెన్నేకొత్తపల్లిలో ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసులకు బదులు పత్రాలను అంబేడ్కర్ చిత్ర పటానికి అందజేస్తూ నిరసన వ్యక్తం చేశారు. నార్పలలోని తహసీల్దారు కార్యాలయం వద్ద స మ్మె కొనసాగించారు. అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.



నార్పలలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద అంగన్‌వాడీల నివాళి





శింగనమల, చెన్నేకొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహాల వద్ద అంగన్‌వాడీల నిరసన

ప్రజాసమస్యలపై జనసైనికుల ఆరా

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 19: స్థానిక పావురాలగుట్ట కాలనీలో జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, కల్పనజోష్ కాలనీలో జనసేన నగర అధ్యక్షుడు బాబురావు శుక్రవారం పర్యటించి.. ప్రజా సమస్యలపై ఆరాతీశారు. పెండ్యాల శ్రీలత మాటామంతి కార్యక్రమంలో భాగంగా పావురాల గుట్ట కాలనీలో మహిళలో మాట్లాడారు. తమకు ఇంటి పట్టాలు లేవని, పాఠశాలలు, నీటి సదుపాయం, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలూ లేవని మహిళలు వాపోయారు. టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని పెండ్యాల శ్రీలత వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదు..

రెండో డివిజన్ పరిధి కల్పనాజోష్ కాలనీలో ఏళ్ల తరబడి డ్రైనేజీ సమస్య ఉందని, ఎమ్మెల్యేకు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదని ఆ కాలనీ వాసులు బాబురావు వద్ద వాపోయారు. పెద్దపెద్ద విషసర్పాలు ఇళ్లలోకి చొరబడుతున్నాయని, భయంతో జీవిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, నగర ప్రధాన కార్యదర్శిలు మేదర వెంకటేష్, దరాజ్‌బాషా, నగర కార్యదర్శులు కుమ్మర మురళీ, అంజి, ఆకుల అశోక్, నాయకులు విజయ్, బాషా పాల్గొన్నారు.





పావురాలగుట్టలో పెండ్యాల శ్రీలత, కల్పనాజోష్ కాలనీలో బాబురావు సమస్యలపై ఆరా తీస్తున్న దృశ్యం

ఎమ్మార్పీఎస్ నాయకుడికి మాజీ ఎంపీ జేసీ పరామర్శ


యోగక్షేమాలు తెలుసుకుంటున్న దివాకర్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి19: మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో శుక్రవారం రాత్రి ఎమ్మార్పీఎస్ నాయకుడు గంగరాజును టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి, యాడికి సీనియర్ టీడీపీ నాయకులు చవ్వా గోపాల్‌రెడ్డి పరామర్శించారు. కొన్ని రోజులక్రితం రోడ్డుప్రమాదంలో గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స అనంతరం నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయన్ను జేసీ పరామర్శించారు.

యాడికి: రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజలంతా చంద్రబాబునాయుడుకు అండగా నిలవాలని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని లక్షుంపల్లి, కేశవరాయునిపేట గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పలువురు నాయకులను కలిశారు. గ్రామస్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిస్థితులు బాగా లేవన్నారు. అభివృద్ధి పనులు పూర్తిగా ఆగి పోయాయన్నారు. ఆయన వెంట క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, చలమారెడ్డి, రవికుమార్‌రెడ్డి, శ్యాంసుందర్‌నాయుడు, శ్రీనివాసులరెడ్డి, చంద్ర, కొండన్న, రాజా, నాగేంద్ర, రంగారెడ్డి, దివాకర్, జయరాముడు, సాంబశివారెడ్డి, మల్లికార్జునరెడ్డి, తిరుపాలు, నాగరాజు తదితరులు ఉన్నారు.

మండలంలోని కేశవరాయునిపేట గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన అంగన్‌వాడీ వర్కర్ విజయలక్ష్మి కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి పరామర్శించారు.

సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి


మాట్లాడుతున్న జితేంద్రగౌడు

గుంతకల్లుటౌన్/పామిడి, జనవరి 19: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసు కెళ్లాలని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు పిలుపునిచ్చారు. తన క్యాంపు కార్యాలయంలో ఆయన పామిడి పట్టణ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్ చార్జిలతో విస్తృతస్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపట్టడం తథ్యమని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అవలంబిస్తున్న అరాచక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాళ్యం గ్రామంలో నిర్వహించే జయహో బీసీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. సమీక్షలో గుంతకల్లు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుమ్మనూరు వెంకటేష్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ వైయూ రామాంజనేయులు, టీడీపీ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, వడ్డే శివకుమార్, యూనిట్ ఇన్‌చార్జులు బొమ్మా మోహన్‌కృష్ణ, మాధవ, సూర్యనారాయణ, శివ, దూదు, యుగంధర్, మస్తాన్, శివారెడ్డి, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువత మేలుకోకపోతే రాష్ట్రం అధోగతే: జేసీపీఆర్


యువతితో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి19: యువత మేలుకోకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రజలకు వివరించారు. యువ చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని రామరాజుపల్లి, రాంపురం, గోపరాజుపల్లి, మొలకతాళ్ల, చిత్రచేడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనస్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లో ఆయన పలువురు యువకులతో మాట్లాడారు. మీరు రాజకీయంగా చైతన్యం కాకపోతే రాష్ట్రం అప్పులపాలై దివాళా తీస్తుందని హెచ్చరించారు. రాష్ట్రం పురోగతి కోసం అహర్నిశలు పాటుపడిన చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. మహిళలు కూడా చైతన్యవంతులై రాబోయే ఎన్నికల్లో టీడీపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. బస్సుయాత్రలో భాగంగా కోటకొండ ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆయన వెంట చిత్రచేడు సర్పంచు రాము, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, నరేంద్రరెడ్డి, దస్తగిరి, కార్యకర్తలు ఉన్నారు.


కంబదూరులో అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు మద్దతు తెలుపుతున్న ఉమామహేశ్వరనాయుడు


కుందుర్పిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు


ఉరవకొండలో మాట్లాడుతున్న ఓబులు


తాడిపత్రిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు


బెళుగుప్పలో నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు


కళ్యాణదుర్గంలో అంగన్‌వాడీల సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

రాజ్యాంగ నిర్మాతా..! జ్ఞానోదయం కలిగించు

'రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మీరైనా జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞానోదయం కలిగించండి' అని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆయన చిత్రపటం వద్ద విన్నవించారు. డిమాండ్ల సాధనలో భాగంగా వారు నిర్వహిస్తున్న సమ్మె శుక్రవారం 39వ రోజు కొనసాగింది. వీరికి కళ్యాణదుర్గంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వరనాయుడు, ఉరవకొండలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు ఓబులు సంఘీభావం తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్


విడపనకల్లులో నిరాహార దీక్ష చేస్తున్న అంగన్‌వాడీలు


గుమ్మఘట్టలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


బొమ్మనహాళ్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు


కూడేరులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అంగన్‌వాడీలు


గుత్తిలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద అంగన్‌వాడీల నిరసన

నాయీ బ్రాహ్మణులకు అండగా టీడీపీ


పోస్టర్లు విడుదల చేసిన పయ్యావుల కేశవ్

కూడేరు, జనవరి 19: నాయీబ్రాహ్మణులకు టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. శుక్రవారం నాయీబ్రాహ్మణుల సంక్షేమ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో రద్దయిన పథకాలను టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కడదరకుంట నాగరాజు, కొండన్న, ఆనంద్, మల్లికార్జున, సిఎం రాజు, హరి, శీన పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

కూడేరు, జనవరి 19: మండలంలోని పి. నాగిరెడ్డిపల్లిలో ఓ వ్యక్తి నిల్వ చేసిన ఆంధ్ర మద్యంను స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు.,

పేకాటరాయుళ్ల అరెస్టు

కుందుర్పి, జనవరి 19: మండలంలోని తెనగల్లు సమీపంలో పేకాట స్థావరంపై శుక్రవారం దాడులు నిర్వహించి, ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. మూడు వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

75 మందికి వైద్యసేవలు

యల్లనూరు, జనవరి19: మండలకేంద్రంలోని సచివాలయం-2లో ఏర్పాటుచేసిన వైద్యశిబిరంలో 75మందికి వైద్యసేవలు అందించామని డాక్టర్ లోకేశ్ తెలిపారు. షుగర్, బీపీ, ఎముకలు, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు జరిపినట్లు తెలిపారు.

ఇసుక టిప్పర్ సీజ్

తాడిపత్రిటౌన్, జనవరి19: మండలంలోని బుగ్గ సర్కిల్ వద్ద శుక్రవారం ఇసుక టిప్పర్‌ను సీజ్ చేశామని రూరల్ పోలీసులు తెలిపారు. యాడికి మండలం గుడిపాడుకు చెందిన డ్రైవర్ తిరుపాల్‌ను అరెస్ట్‌చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నంపై కేసు నమోదు

తాడిపత్రిటౌన్, జనవరి 19: పట్టణంలోని టైలర్స్ కాలనీకి చెందిన సౌజన్య ఫిర్యాదు మేరకు భర్త రాజేశ్వర్‌రెడ్డి, అత్త చౌడేశ్వరి, మరిది నిఖిల్‌కుమార్‌రెడ్డి పై అదనపు కట్నం కేసు నమోదుచేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు సౌజన్యకు 2022లో పట్టణానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డితో పెళ్లి జరి గింది. చార్టర్డ్ అకౌంటెంట్ అని చెప్పి వివాహం చేసుకున్న రాజేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఖాళీగా ఉంటున్నాడు. వివాహ సమయంలో 50తులాల బంగారంతోపాటు రూ.5లక్షల నగదు ఇచ్చా రు. కానీ అదనంగా కట్నం తేవాలంటూ భర్తతోపాటు అత్త, మరిది వేధిస్తుండడంతో తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. వేధింపులు అధికం కావడంతో శుక్రవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఘనంగా వేమన జయంతి

గుంతకల్లుటౌన్, జనవరి 19: పట్టణంలోని శారదా విద్య మందిరంలో భారతీ సాహితీ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం వేమన జయంతిని నిర్వహించారు. వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో విద్వాన్ గంగమ్మ, శశదాయాళ్, గంగరాజు, పరంధామయ్య, జీసీ చంద్రశేఖర్, పాల్గొన్నారు.

రథయాత్రను విజయవంతం చేయండి

రాయదుర్గంరూరల్, జనవరి 19: సంత్ సేవాలాల్ శాంతి రథయాత్రను విజయవంతం చేయాలని జిల్లా ఉపాధ్యక్షులు ఎంకా నాయక్ పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం సమావేశం నిర్వహించి పోస్టర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనవరి 26న జరిగే ఈ యాత్రలో ఏబీఎస్ఎస్ బంజారా నాయకులు, సభ్యులు, ప్రజలు పాల్గొనాలన్నారు.

దళితులకు న్యాయం

బొమ్మనహాళ్, జనవరి 19: అధికారుల సహకారంతో తమకు న్యాయం జరిగిందని దళితులు పేర్కొన్నారు. మండలంలోని హరేసముద్రం గ్రామ పొలంలో 177 సర్వే నెంబర్‌లో తమ భూమిని కొందరు అగ్రవర్ణానికి చెందిన వారు కబ్జా చేశారన్నారు. న్యాయ పోరాటం చేయడంతో తమ 9 ఎకరాల భూమి దక్కిందని వెంకటరమణ, శివరాజ్, కెంచప్ప శుక్రవారం తెలిపారు.

మళ్లీ పార్టీలోకి చేర్చుకోవడం సిగ్గుచేటు

రాయదుర్గం, జనవరి 19: వైసీపీ కార్యకర్తలకు ఆ పార్టీ కండువాలు వేసి మళ్లీ ఆ పార్టీలోకి ఆహ్వానించడం విడ్డూరంగా ఉందని టీడీపీ మండల కన్వీనర్ కురుబ హనుమంతు, సర్పంచ్ మల్లేశప్ప విమర్శించారు. శుక్రవారం ప్రకటనను విడుదల చేశారు. ఈ సందర్భంగా చదం గొల్లలదొడ్డి గ్రామంలో వైసీపీకి చెందిన 10 కుటుంబాలకు వైసీపీ జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డిలు వైసీపీ కండువాలు కప్పడం సిగ్గు చేటన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గంరూరల్, జనవరి 19: మండలంలోని గరుడాపురం గ్రామంలో మతి స్థిమితం లేని వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు గరుడాపురం గ్రామానికి చెందిన బోయ హనుమప్ప (40) మతిస్థిమితం లేకపోవడంతో గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అయితే గరుడాపురం పక్కనే ఉన్న తోటలో చింత చెట్టుకు తన లుంగితో ఉరివేసుకుని శుక్రవారం మృతి చెందాడు. గొర్రెల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి భార్య చిత్రావతి, ఒక కుమారుడు, కుమార్తె వున్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతాం: ఉన్నం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉన్నం

కళ్యాణదుర్గం, జనవరి 19: వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించుతామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయచౌదరి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాలవాయి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోళ్ల వెంకటేశులు, డీకే రామాంజినేయులు పాల్గొన్నారు.

చంద్రబాబు గెలిస్తేనే రాష్ట్రం సుభిక్షం: శ్రావణి


వృద్ధురాలితో మాట్లాడుతున్న బండారు శ్రావణి

పుట్లూరు, జనవరి19: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు గెలిస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి పేర్కొన్నారు. మండలంలోని నారాయణరెడ్డిపల్లి గ్రామంలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె టీడీపీ ప్రకటించిన మినీ మేనిఫెస్టోను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించి కరపత్రాలను అందజేశారు. జీసీ బాబు, గోవర్ధన్‌రాజు, వేణు, వెంకటనాయుడు, ప్రసాద్‌నాయుడు, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

పెద్దవడుగూరు, జనవరి19: వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సాగుచేసిన రైతులకు వర్షాభావ పరిస్థితులతో నష్టం వచ్చిందన్నారు. మండలంలో పత్తి, మిరప, సజ్జ, జొన్న, వేరుశనగ పంటలు సాగుచేసిన రైతులు వర్షాలు లేక పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణమే ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు. సమావేశంలో రంగయ్య సూర్యనారాయణరెడ్డి, నారాయణ, హుస్సేన్‌పీరా తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా 'ఉపాధి' బహిరంగ సభ


బహిరంగ సభలో మందలిస్తున్న అధికారులు

పామిడి, జనవరి 19: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బహిరంగ సభ మొక్కుబడిగా నిర్వహించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 31 డిసెంబరు2023 ఆర్థిక సంవత్సరం వరకూ ఉపాధి హామీ పథకం ద్వారా 694 పనులకు రూ.7,56,58,501లు వెచ్చించినట్లు ఏపీఓ మల్లీశ్వరి పేర్కొన్నారు. ఈ పనులపై గతేడాది డిసెంబరు 28 నుంచి జనవరి 13వరకూ మండలంలో సామాజిక తనిఖీ చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి రమణారెడ్డి వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, గుత్తి క్లస్టర్ ఏపీడీ విజయ్‌కుమార్, అంబుడ్స్‌మెన్ మధుసూదన్, ఎంపీడీఓ ప్రభాకర్, ఎంపీపీ మురళీధర్‌రెడ్డి హాజరయ్యారు. మండలంలో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా చేపట్టిన మొక్కల పెంపకంలో చాలా గ్రామాలలో మొక్కలు చనిపోయాయన్నారు. వాటి స్థానంలో రీప్లాంటేషన్ చేయాలని అధికారులు బహిరంగ సభ ముగిసినా రికవరీ, అపరాధ రుసుం, దుర్వినియోగ మొత్తంను వెల్లడించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం గమనార్హం.

దళితుల పట్ల వైసీపీది కపట ప్రేమ

గుంతకల్లుటౌన్, జనవరి 19: దళితుల పట్ల సీఎం జగన్‌కు నిజయంగా ప్రేమ ఉంటే 27 ఎస్సీ సంక్షేమ పథకాలను ఎందుకు రద్దు చేశారని టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు ప్రశ్నించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో జగన్‌రెడ్డి దళితుల ఓట్లు లక్ష్యంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్నాడని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జింకల జగన్నాథ్, దశరథ్‌రామ్, ఓ చంద్రయ్య, చికెన్‌జగన్నాథ్ పాల్గొన్నారు.

ఉరవకొండ: దళితుల పట్ల వైసీపీది కపట ప్రేమ అని టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు నరేష్ ఆరోపించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో దళితులపై ఆరువేలకు పైగా దాడులు జరిగాయన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యగా ఉన్న పేరుగా జగనన్న విదేశీ విద్యగా మార్చినపుడే దళితులపై ఆయనకు ఎలాంటి ప్రేమ లేదని తేలిపోయిందన్నారు. వరప్రసాద్, రామకృష్ణ, కృష్ణ, రామాంజినేయులు, పెద్దన్న, సుధాకర్, రవివర్మ పాల్గొన్నారు.

తాడిపత్రి: దళిత ద్రోహి అయిన ముఖ్యమంత్రి జగన్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని టీడీపీ ఎస్సీసెల్ జిల్లా జనరల్ సెక్రటరీ మల్లికార్జున విమర్శించారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఐదు సంవత్సరాలుగా జైలులో మగ్గుతున్న కోడికత్తి శీనును వెంటనే విడుదల చేయాలంటూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ దళితులపై హత్యాచారాలు, దాడులు జరుగుతున్నా ముఖ్యమంత్రి నోరుమెదపకుండా దళిత ఆశాజ్యోతిగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు


ఉరవకొండలో మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

గడప గడప పనులను చేపట్టండి: టీడీపీ

గుంతకల్లు, జనవరి 19: గడపగడప కింద చేయాల్సి ఉన్న పనులను వెంటనే చేపట్టాలని, లేదంటే నిధులు మురిగిపోతాయని టీడీపీ కౌన్సిలరు పవన్‌కుమార్ గౌడు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం మునిసిపల్ సమావేశ భవనంలో బడ్జెట్ మీటింగును చైర్‌పర్సన్ ఎన్ భవాని అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలరు కృపాకర్ మాట్లాడుతూ పాత గర్ల్స్ హైస్కూలు ప్రదేశాన్ని అద్దెకు ఇచ్చి మునిసిపాలిటీ ఆదాయాన్ని పెంచాలని కోరారు. కార్యక్రమంలో కార్యక్రమంలో కమిషనరు మల్లికార్జున టీడీపీ కౌన్సిలర్లు ఆంజనేయులు, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'లో కబడ్డీ ఆటగాళ్ల ఘర్షణ


గుమిగూడిన ఆటగాళ్లు, ప్రజలు

గుంతకల్లు, జనవరి19: ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీల్లో ఆటగాళ్ల ఘర్షణపడ్డారు. జట్టు ఆటగాడినే అంపైర్‌గా చేసి కీలకమైన దశలో తమను మోసగించి గెలిచారంటూ వాదనకు దిగిన సంఘటన గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ కళాశాల గ్రౌండులో చోటుచేసుకుంది. శుక్రవారం ఈ కళాశాల క్రీడా స్థలంలో గుంతకల్లులోని మహబూబాబాద్ సచివాలయం, మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయం జట్ల మధ్య కబడ్డీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను నిర్వహించారు. నిర్ణీత గడువు ముగుస్తున్న సమయానికి అంపైర్ అక్రమంగా మహబూబాబాద్ జట్టుకు ఒక పాయింట్‌ను కేటాయించారని, ప్రశ్నిస్తుండగానే సమయం పూర్తయిందం టూ మ్యాచ్ ఫలితాన్ని ప్రకటించారని ఆరోపించారు. మహబూబాబాద్ జట్టుకు 19 పాయింట్లు, అయ్యవారిపల్లి జట్టుకు 18 పాయింట్లు లభించాయి. మహబూబాబాద్ జట్టు ఆటగాడైన వీరాంజనేయులును న్యాయనిర్ణేతగా అక్రమంగా నియమించారని, అతడు తన జట్టుకు అక్రమంగా ఓ పాయింటును కేటాయించి గెలిపించాడని వాదనకు దిగారు. విషయం మునిసిపల్ కమిషనరు మల్లికార్జున దృష్టికి రాగా, ఆయన వెంటనే కసాపురం పోలీసులకు తెలిపారు. మ్యాచ్ ముగిసినందున వాదనలకు తావు లేదంటూ అయ్యవారిపల్లి జట్టు సభ్యులకు స్పష్టంచేయడంతో వారు నిరసన తెలుపుతూ వెళ్లిపోయారు.

ఆసుపత్రిపాలెంలో పర్యటించిన జేసీ అశ్మిత్‌రెడ్డి


మాట్లాడుతున్న జేసీ అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, జనవరి19: పట్టణంలోని ఆసుపత్రిపాలెంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి శుక్రవారం పర్యటించారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే మున్సిపాలిటీకి పూర్వవైభవం తెస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ లీగల్ సెల్ జనరల్ సెక్రటరీ అనిఫ్‌బాషా, 27వవార్డు కౌన్సిలర్ రేష్మాపర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడికత్తి శీనును వెంటనే విడుదల చేయాలి


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాయదుర్గం, జనవరి 19: కోడికత్తి శీనును వెంటనే విడుదల చేయాలని టీడీపీ పట్టణ కన్వీనర్ పసుపులేటి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మొలకాల్మూరు రోడ్డులో ఉన్న అంబేడర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విజయవాడలో కోడికత్తి శీను తల్లిదండ్రులు చేపట్టిన నిరసనకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోరాళు పురుషోత్తం, టీడీపీ నాయకులు పైతోట సిద్ధప్ప, కేడిమి తిప్పేస్వామి, కరెన్న, కృష్ణ, వేటూరు కుమార్, ఆనంద్, ఇనాయత్, మల్లికార్జున, యాల్పుల వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు విడుదల చేయాలి: యూటీఎఫ్


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం, జనవరి 19: తమ బకాయిలు వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ నాయకులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర నాయకులు ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు దాదాపు రూ. 18 వేల కోట్ల ఆర్థిక బకాయిలు పెండింగ్‌లో పెట్టిందన్నారు. ఏడాదిన్నరగా ఉద్యోగ ఉపాధ్యాయుల పీఎఫ్, ఏపీజీఎల్, ఈఎల్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ మొదలగు ఫైళ్లకు సంబంధించిన బకాయిలు విడుదల కాలేదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. 2023లో పూర్తి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినప్పటికీ నేటికీ ఆ హామీలు అమలు కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని జిల్లా కార్యదర్శి అర్జున్ అన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు అబ్దుల్ వహాబ్ ఖాన్, అర్జున్, చిత్తప్ప, సీనియర్ నాయకులు రాజేంద్ర, శ్రీరామిరెడ్డి, మంజునాథ్, ఐదు మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొన్నారు.